క్లుప్తంగా

వీల్‌ఛైర్ అందజేత



స్నేహితకు వీల్‌ఛైర్ అందచేస్తున్న దృశ్యం

చింతలపూడి : మండలంలోని యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతురాలు తొమ్మండ్రు స్నేహితకు అజీమ్ ఛారిటీ ఆదివారం వీల్‌ఛైర్ అందించింది. సర్పంచ్ తుల్లిమెల్లి రాణి, నేతలు టి కుటుంబరావు, చిన్న కుటుంబరావు చేతులమీదుగా స్నేహితకు వీల్‌ఛైర్ అందించారు. ఈ సందర్భంగా అజీమ్ ఛారిటీ అందిస్తున్న సేవలను సర్పంచ్ రాణి అభినందించారు. కార్యక్రమంలో అజీమ్ ఛారిటీ అధ్యక్షుడు ఎస్‌కే ఆజాద్‌బాబు, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్ట్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన రాజేష్‌కు చికిత్స అందిస్తున్న దృశ్యం

చింతలపూడి : స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం చింతలపూడికి చెందిన కొండా రాజేష్ మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుణ్ణి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై హరికృష్ణ తెలిపారు.

20 నుంచి కావూరి ఫౌండేషన్ కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): పట్టణంలోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో ఈ నెల 20 నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ పీఆర్‌ఓ పులి శ్రీరాములు ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీ, ఇంటర్ (కామర్స్) ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి 20 వరకూ సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తులు అందజేస్తారని, ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన 18–35 ఏళ్ల వయస్సు ఉన్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పులి శ్రీరాములు కోరారు.

బంజారా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణ



గుగ్గులోతు కృష్ణ నాయక్

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగ్గలోతు కృష్ణనాయక్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బోడా బాల నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆదివారం జాతీయ ఉపాధ్యక్షుడు పీఎల్ రవీంద్ర నాయక్ నూతన కమిటీతో పదవీ స్వీకారం చేయించినట్లు గుగ్గలోతు కృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ లంబాడి జాతి అభివృద్ధికి కృషి చేస్తానని, లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లతానని అన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి ఎన్నికైన గుగ్గలోతు కృష్ణ నాయక్, బోడా బాలా నాయక్‌లను బంజారా నాయకులు అభినందించారు.

చదరంగ క్రీడ అభివృద్ధికి కృషి



వాసుదేవరావును అభినందిస్తున్న దృశ్యం


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో చదరంగ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ కన్వీనర్ వేల్పూరి వాసుదేవరావు తెలిపారు. ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ కన్వీనర్‌గా వేల్పూరి వాసుదేవరావును నియమిస్తూ ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ శర్మ ప్రకటించిన సందర్భంగా ఆదివారం నగరంలో ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ సందర్భంగా వివిధ చెస్ అకాడమీలకు చెందిన డి.లక్ష్మణరావు, జి.యెవహాన్, వై.మహేష్, కె.కుమారి, కలిదిండి శ్వేత వాసుదేవరావుకు పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యేకంగా అభినందించారు.

మాజీ సర్పంచ్ మట్టా సంస్మరణ సభ

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ప్రముఖ గేయ కవి టి.రామకృష్ణ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు అనేక రచనలు చేసి సాహిత్యంలో విశేష కృషి చేశారన్నారు. గ్రామపెద్దలు టీవీఎ గోపాలరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధికి వెంకటేశ్వరరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. సర్పంచ్ గెల్లా వెంకటరమణ,కళాకారులు పాల్గొన్నారు.

జల్లేరు.. సమృద్ధిగా సాగునీరు

- ఈ ఏడాది వర్షాలకు సామర్థ్యానికి మించి ప్రాజెక్ట్‌లో చేరిన నీరు
- రబీలో సుమారు 400 ఎకరాలను సాగు చేస్తున్న రైతులు



జల్లేరు జలాశయం పంట కాలువ ద్వారా నీరు ప్రవహిస్తున్న దృశ్యం



జల్లేరు నీటితో తన పొలంలోకి నీరు పెట్టుకుంటున్న గిరిజన రైతు

బుట్టాయగూడెం : మండలంలోని అలివేరు సమీపంలో ఉన్న జల్లేరు జలాశయం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు రబీసాగులో నీరు పుష్కలంగా లభిస్తోంది. ఈ ప్రాంతంలో అలివేరు డ్యామ్ కాలనీ, చిన్నజీడిపూడి, పెద్ద జీడిపూడి, గుర్రప్పగూడెం, గుబ్బిసమామిడి, దొరమామిడి, తెల్లంవారిగూడెం, ముప్పినవారిగూడెంతో పాటు జలాశయంపై గ్రామాలైన లంకపాకల, ఎర్రాయిగూడెం, కొత్త అలివేరు, పాత అలివేరు, తదితర గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులు పూర్తి వర్షాధారంపైనే వ్యవసాయ పంటలు చేస్తూ ఉంటారు. అయితే ఖరీఫ్ సీజన్‌కు వర్షాధారంపైనే పంటలు పండిస్తున్నా రబీ సీజన్ సమయంలో జల్లేరు జలాశయం నీరే పూర్తిగా ఆధారం. అయితే ఆయా ప్రాంతాల్లోని గ్రామాల గిరిజన రైతులకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతోనే ఈ జల్లేరు జలాశయంను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు 217.08 మీటర్ల సామర్థ్యం ఉంది. అయితే ఈ ఏడాది నవంబర్, డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు సామర్థ్యానికి మించి ప్రాజెక్టులో నీరు వచ్చి చేరింది. సుమారు 800 క్యూసెక్ మీటర్‌ల వరకూ నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేసి ప్రాజెక్టు సామర్థ్యం వరకూ నీటిని నిల్వ చేశారు. రబీ సీజన్ ప్రారంభం కాగానే అక్టోబర్ మాసంలో పంట కాల్వ ద్వారా నీరు విడుదల చేయడంతో సుమారు 400 ఎకరాల వరకూ రైతులు వరి, మొక్కజొన్న, చెరకు, మిర్చి, పొగాకు, అపరాలు వంటి పంటలను సాగు చేసుకుంటున్నారు. నీరు పుష్కలంగా అందడంతో పచ్చదనంతో పంటలు కళకళలాడుతూ కనిపిస్తున్నాయి. ఉదయం లేచిన వెంటనే రైతులు పొలానికి వెళ్లి పంట కాల్వ ద్వారా వచ్చిన నీటిని వారి చేలకు మలుచుకుని పంటలు పండిస్తున్నారు.

వంతుల వారీగా విడుదల చేస్తున్నాం



ఏటా రబీలో రైతులకు పంటలకు నీరు వంతుల వారీగా విడుదల చేస్తున్నాం. వర్షాలు సమృద్ధిగా వచ్చిన సమయంలో జల్లేరు జలాశయంలోని నీటిని విడుదల చేసి రబీలో రైతులకు అన్ని రకాల పంటలకు నీరు అందేలా కృషి చేస్తున్నాం. రైతులు కూడా వంతుల వారీగా నీటిని వినియోగించుకోవాలని కోరుతున్నాం

– టి.సురేష్, ఎంఐ ఏఈఈ– కేఆర్‌పురం

400 ఎకరాలకు పైగా పంటలు వేశారు



జల్లేరు జలాశయం ప్రాజెక్టు దిగువ, ఎగువ ప్రాంతాల్లో రైతులు 400 ఎకరాలకు పైగా పంటలు వేశారు. మొక్కజొన్న అత్యధికంగా వేశారు. వరి, చెరకు, పొగాకు, అపరాల సాగు చేస్తున్నారు. జలాశయం నీటి ద్వారా రైతులకు సాగునీరు సమృద్ధిగా అందుతున్నాయి.

– బి. సుమలత, ఏఓ, బుట్టాయగూడెం మండలం

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో







పట్టిసం రేవులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో ఝాన్సీరాణి, దేవులపల్లిలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం, జంగారెడ్డిగూడెం వైఎస్సార్ నగర్ కాలనీలో జంట నాగుల శిలా విగ్రహ ప్రతిష్ట

పోలవరం రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లను నిర్ణయించిన సమయానికి పూర్తి చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఎం.ఝాన్సీరాణి ఆదేశించారు. ఆదివారం పట్టిసం రేవులో ఫ్లాట్‌ఫారాలు, ర్యాంపులు, పంట్ల ఏర్పాటు, చలువ పందిళ్ల తదితర పనులను పరిశీలించారు. 18వ తేదీ మహాశివరాత్రికి రెండు రోజులు ముందుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని, ఎప్పటికప్పుడు స్థానిక అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ బి.సుమతి, డీటీ కాజా రమేష్ ఉన్నారు.

నేత్రపర్వంగా అంజన్న గ్రామోత్సవం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని దేవులపల్లిలో కొలువై ఉన్న శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న 14వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు కర్పూరం నాగరాజు, ఆంజనేయ గుప్త ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జంట నాగుల శిలా విగ్రహ ప్రతిష్ట

జంగారెడ్డిగూడెం : స్థానిక వైఎస్సార్ కాలనీలో జంట నాగుల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రావిచెట్టు, వేపచెట్టు కలిసి ఉన్న ప్రదేశంలో ఈ విగ్రహ ప్రతిష్ట చేశారు. బ్రహ్మశ్రీ కందగిరి అశోక్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ దాతలు నూజివీడుకు చెందిన బ్రహ్మశ్రీ జువ్వలపల్లి రూప్‌కుమార్, ధనలక్ష్మి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. శనివారం జంట నాగుల శిలా విగ్రహానికి జలాధివాసం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, ధనాదివాసం హోమ కార్యక్రమలు నిర్వహించగా, ఆదివారం ప్రతిష్ట, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఉచిత శిబిరంలో 150 మందికి వైద్యసేవలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ద్వారకాతిరుమల: లయన్స్‌క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని జి.కొత్తపల్లి ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె, నేత్ర, జనరల్ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు పి.రితీష్, తేజస్వీ, ఆదిత్య 150 మంది రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలను జరిపి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా విజయ హాస్పిటల్ ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రితీష్ మాట్లాడుతూ గుండె నొప్పులపై సరైన అవగాహన లేక ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. కరోనా అనంతరం చిన్న వయస్సు గల వారికి కూడా గుండె సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్సే శ్రీహరి, లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, జిల్లా ఛైర్మన్ పులపా ఆనంద్‌కుమార్, క్లబ్ మండల అధ్యక్షుడు కారుమంచి మురళీ, మానవత జిల్లా కార్యదర్శి ఎన్‌బీ వెంకటరావు, రేగంటి రాంబాబు, ఆలపాటి శ్రీనివాసరావు, దాసరి ఏసురత్నం, హాస్పిటల్స్ మేనేజర్ ఎం.సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినికి సైకిల్ పంపిణీ



విద్యార్థినికి సైకిల్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : వారధి ట్రస్ట్ ద్వారా బాలికా విద్య ప్రోత్సాహంలో భాగంగా విద్యార్థినిలకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మరో విద్యార్థినికి ఆదివారం సైకిల్‌ను పంపిణీ చేశారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద స్థానిక బాలుర హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఉసిరిక లక్ష్మీతులసికి సైకిల్ పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ మాట్లాడుతూ సింహాద్రి మొబైల్ అధినేత మద్దుల రాంబాబు, అన్నపూర్ణ దంపతుల వితరణతో ఈ సైకిల్‌ను అందించినట్లు తెలిపారు. ట్రస్ట్ ద్వారా 18 సైకిళ్ల పంపిణీ లక్ష్యం పూర్తయినప్పటికీ దాతల సహకారం కొనసాగుతుండడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో మద్దుల రాంబాబు, ధనకుమార్, మద్దిపాటి శ్రీను, కలపాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలాపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీనం దత్తనాథ క్షేత్రం భగవద్గీత పారాయణ బృందం సభ్యులు భగవద్గీతలోని 18 అధ్యాయాలను అత్యంత భక్తి శ్రద్ధలతో పారాయణ చేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషంగా అలంకరించారు. సాయంత్రం 5.30 గంటలకు వేదాంతం విష్ణుప్రసాద్ హైందవ ధర్మ విశిష్టత అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన రామానుజ నృత్యధార సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా అలరించాయి. అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి



కృష్ణాపురంలో సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284 జయంతి వేడుకలు మండలంలోని కృష్ణాపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాగో, బంజారా, మరో నంగరా, లంబాడి కులం ఆరాధ్య దేవుడు సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా భూక్యా వేణుగోపాల్ ఆధ్వర్యంలో మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేశారు. డాక్టర్ భూక్యా కృష్ణ సమాకూర్చిన దుప్పట్లు 100 కుటుంబాలకు, వృద్ధులకు అందజేశారు. ముఖ్య అతిథులుగా లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దరువాత్తు కిమ్యా, దరావత్తు రాజబాబు, భూక్యా బిగ్నాధం, బాణావత్ గోపాలకృష్ణ, భూక్యా నాగేశ్వరరావు, భూక్యా సత్తిబాబు, హసవత్ వెంకటేశ్వరరావు, భూక్యా రాములు తదితరులు పాల్గొన్నారు. కాగా జయంతి వేడుకల్లో భాగంగా ఈనెల 15న చింతలపూడి మార్కెట్ యార్డ్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, లంబాడి ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని వేణుగోపాల్ పిలుపునిచ్చారు.

సుబ్బరాజు సేవలు ఎనలేనివి



సుబ్బరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, ఇడా ఛైర్‌పర్సన్ ఈశ్వరి

ఏలూరు టౌన్: చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పని చేస్తూ, పెన్మెత్స సుబ్బరాజు విశేష సేవలు చేశారని, స్వార్థం లేకుండా చేసే ప్రతీ సేవల్లోనూ అనేక మంది పేదలకు సాయం అందుతుందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని అన్నారు. ఏలూరు చోడిదిబ్బ కమ్యూనిటీ హాలులో ఇటీవల మృతి చెందిన సుబ్బరాజు సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సుబ్బరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలనీ, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, నాయకులు నున్న కిషోర్, కిలాడి దుర్గారావు, ఈదుపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి పథకాలు దోహదం

పెదవేగి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉందని, వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో దెందులూరు నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆయన అన్నారు. పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన పంది కొండలరావు, దాసరి సుబ్బారావు, సిమట నాగరాజు, పంది సుబ్బారావు, వీరమల్లు రాజును ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముండూరు సొసైటీ ప్రెసిడెంట్ చెరుకూరి ప్రసాద్, ఎంపీటీసీ కో ఆప్షన్ మెంబర్ పాకలపాటి ఫిలిప్, ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ముస్సె శ్రీను, నాయకులు పంది జగన్, టి పెద్దిరాజు, పంది కొండలరావు, పంది శ్రీనివాసరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్షవాత బాధితుడికి సాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సేవా కార్యక్రమాల్లో బాగంగా పక్షవాతంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక కుటుంబానికి చేయూత అందించింది. కలకుర్రు గ్రామానికి చెందిన సైదు శ్రీనివాసరావు పక్షవాతంతో బాధపడుతూ కుటుంబ పోషణ భారంగా ఉండడంతో అతని ఇరువురు కుమారులు చదువు మాని కుటుంబబారాన్ని మోస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ప్రతినిధులు ఆదివారం వారి నివాసానికి వెళ్లి సైదు శ్రీనివాసరావుకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆ సంస్థ సభ్యులు డీకేఎస్ఎస్ ప్రకాష్, జీ. మోహన్, గుంటూరు శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరావు, ముంగర దేవి, జీ. సత్యశ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రోటరీ కార్యదర్శిగా తిలక్

జంగారెడ్డిగూడెం : స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రోటరీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు దాకారపు కృష్ణ మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి అధ్యక్షుడిగా రొంగల దేవీప్రసాద్‌ను ఇప్పటికే ఎంపిక చేశామని, ఈ సమావేశంలో కార్యదర్శిగా బవిరిశెట్టి తిలక్‌ను కార్యవర్గం ఎంపిక చేసిందన్నారు. 2023 జూలై1 నుంచి 2024 జూన్ 30 వరకు తిలక్ కార్యదర్శిగా సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మల్లాది సీతారామారావు, గణిత ఆనందప్రసాద్, ధనకుమార్, ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ద్వారకాతిరుమల : యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.జయరాజు, సహ అధ్యక్షుడిగా పి.రాంబాబు, గౌరవాధ్యక్షుడిగా పి.వరప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా పి.మేరి, ప్రధాన కార్యదర్శిగా బీవీ రవీంద్ర, కోశాధికారిగా కట్టా శ్రీనివాసరావు అలాగే కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు, పరిశీలకుడిగా జిల్లా అధ్యక్షుడు రవికుమార్ వ్యవహరించారు.

రైతు కూలీలపై దృక్పథం మారాలి

ఏలూరు (టూటౌన్): రైతు కూలీల పై మన దృక్పథం మారాలని ఎస్సీ,ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికిముక్కు సుబ్బయ్య ,ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగరాజు అన్నారు. స్థానిక ప్రైవేటు పంక్షన్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. భూమి లేని పేద రైతు కూలీల సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న ఏలూరులో సంఘం ఆధ్వర్యంలో భారీ సభను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో యర్రపాటి పెద్దిరాజు,కోలపు రవికుమార్, యర్రపాటి శ్రీను, చిపిరి కరుణ కుమార్, నెరుసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలేషియాలో శిక్షణకు దెందులూరు విద్యార్థి ఎంపిక

దెందులూరు: కెలంట్రాన్ మలేషియా విశ్వవిద్యాలయంలో శిక్షణ కోసం బాపట్ల లోని వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న దెందులూరుకి చెందిన బళ్ల కుమారమ్మ మనవడు శుభాష్ ఎంపికయ్యారని బాపట్ల వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ వీ.శ్రీనివాసరావు తెలిపారు. సంస్థాగత అభివృద్ధి, ప్రణాళికలో భాగంగా సేంద్రియ సాగు ఉద్యానవన శాఖలపై ఈ నెల 14 నుంచి మార్చి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు శిక్షణనిస్తారని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఉన్నత సాంకేతిక విలువలు పెంపొందించడం, సాగులో మెళకువలు శిక్షణ ద్వారా విద్యార్థులు నేర్చుకోవచ్చని తెలిపారు. దెందులూరు విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో శిక్షణకు ఎంపిక కావడంపై బళ్ళ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనకు సమయం కేటాయించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనో స్థైర్యం కలగాలంటే ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనకు కొంత సమయం కేటాయించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వరంగల్ జోన్ డైరెక్టర్ బీకే సవిత పిలుపునిచ్చారు. నగరంలోని బ్రహ్మకుమారీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైవ చింతనే మానసిక ప్రశాంతత నిస్తుందని, ఒత్తిళ్లను జయించడానికి భక్తిమార్గం ఒక్కటే పరిష్కారమన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శన స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన జనసేన నాయకుడు రెడ్డి అప్పల నాయుడు, బ్రహ్మకుమారి ఏలూరు సేవా కేంద్రం నిర్వాహకురాలు బీకే లావణ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. పోలవరం ప్రాజెక్టు పనులు చేస్తున్న కార్మికులు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడుతూ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకోవడం బాధాకరమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మంచి ఆహారాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు.